# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక






సంపుటి : 01 | సంచిక : 90 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శుక్రవారం, 27 ఫిబ్రవరి 2026 | పేజీలు : 4




## బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్లు

- జనగామ కలెక్టర్‌గా సందీప్ కుమార్ ఝా
- మహబూబాబాద్ కలెక్టర్ స్నేహ శబరీష్

**జనగామ, మన చౌరాస్తా :** సాధారణ బదిలీల్లో భాగంగా జనగామ జిల్లా కలెక్టర్‌గా వచ్చిన సందీప్ కుమార్ ఝా గురువారం మధ్యాహ్నం బాధ్యతల స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రిజ్వాన్ బాషా షేక్ జోగులాంబ గద్వాల జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జీహెచ్ఎంసీ, కుత్బుల్లాపూర్, జోనల్ కమిషనర్‌గా ఉన్న సందీప్ కుమార్ ఝా ఇక్కడకు వచ్చారు. అదేవిధంగా మహబూబాబాద్ జిల్లా కలెక్టర్గా డాక్టర్ స్నేహ శబరిష్ కూడా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు (స్థానిక లెనిన్ వత్సల్ టోప్పో, కె.అనిల్ కుమార్, మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీవోలు కృష్ణవేణి, గణేష్, జిల్లా అధికారులు పూల మొక్కలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. స్నేహ శబరీష్ హనుమకొండ కలెక్టర్ విధులు నిర్వర్తించారు.



## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన లబ్దిదారులకు అందేలా అధికారులు బాధ్యత యుతం గా పని చేయాలని స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఇరిగేషన్ అంశాల మీద సంబంధిత అధికారులతో కలెక్టర్, శాసనసభ్యులు గురువారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో రివ్యూ నిర్వహించారు.

2






# సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలి

**– స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం**



జనగామ, మన చౌరాస్తా : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా అధికారులు బాధ్యత యుతం గా పని చేయాలని స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఇరిగేషన్ అంశాల మీద సంబంధిత అధికారులతో కలెక్టర్, శాసన సభ్యులు గురువారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కడియం శ్రీహరి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ లో జనగామ జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో నిలవడం, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం ఉమ్మడి జిల్లాలో మొదటి స్థానంలో నిలవడం పట్ల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అధికారులకు శాసనసభ్యులు అభినందనలు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు మండలాల వారీగా మార్క్ అవుట్ ఇచ్చి పనులు ప్రారంభం కానీ, ఇప్పటి వరకు మార్క్ అవుట్ కూడా చేయని ఇండ్ల వివరాలను సేకరించి వాటిపై ఎంపీడివోలు సమీక్షా చేయాలని తెలిపారు. లబ్ధిదారులు వారం రోజులలో పనులు ప్రారంభించేలా ఎంపీడివోలు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమంలో ఒక్క ఇల్లు కూడా ల్యాప్స్ కావద్దని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవాలని ఆ దిశగా అధికారులు పని చేయాలని తెలిపారు. ఏప్రిల్ లో రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు వచ్చే అవకాశం ఉందని మళ్ళీ నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరు అవుతాయాని అన్నారు. మెదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు సొంత స్థలం ఉన్న వారికి మాత్రమే ఇచ్చామని ఇప్పుడు రెండో విడతలో ఇంటి స్థలం లేని వారికీ ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లు కూడా ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. తహసీల్దార్లు మండలంలోని ఏ ఏ గ్రామాలలో ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉందో, ఇళ్ల నిర్మాణం కోసం భూ సేకరణ జరిగిందో ఆ వివరాలు సేకరించాలని ఆదేశించారు. ఉన్న స్థలంలో ఇప్పుడు ఉన్న నిబంధనల ప్రకారం ఒక ఎకరంలో ఎంత మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వవచో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నిబంధనల ప్రకారం లే అవుట్ సిద్ధం చేయాలని అన్నారు. మార్చి 15 న ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్షా సమావేశం ఉంటుందని ఈ సమావేశానికి పూర్తి స్థాయి వివరాలతో హాజరు కావాలని ఆదేశించారు. సాగు నీరు అందక ఒక్క ఎకరం కూడా ఎండిపోవడానికి వీలు లేదని ఒక్క ఎకరం ఎండిన అధికారులదే బాధ్యత అని స్పష్టం చేశారు. గోదావరి లో సరిపడా నీటి లభ్యత ఉంది కాబట్టి మార్చి చివరి వరకు నీటిని లిఫ్టింగ్ చేయాలని తెలిపారు. మార్చి చివరి వరకు కూడా వ్యవసాయానికి నీరు ఇవ్వాల్సి ఉంటుందని, రిజర్వాయర్ లలో నీటి నిలువలు తగ్గకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఒకటి, రెండు రోజులు పంపింగ్ లో ఏమైనా సమస్యలు వచ్చినా నీటి విడుదలకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని సూచించారు. బొమ్మకూరు కాలువలో పూడిక తీత, చెట్ల తొలగింపు పనులను వారం రోజుల్లో పూర్తిచేసి మంగలి బండ తండా వరకు నీరు అందించాలని తెలిపారు. జఫర్ గడ్ మండలం హిమ్మత్ నగర్ వరకు నీరు చేరాలని అందుకు కాలువ పూడిక తీత పనులకు ఎస్ డిఎఫ్ నుండి 5లక్షలు మంజూరు చేస్తానని వెంటనే పనులు ప్రారంభించి వారం రోజుల్లో నీరు అందించాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే మనందరి బాధ్యత అని అన్నారు. మనం చేసే పనిలో మనకు సంతృప్తి ఉండాలని ఆ దిశగా పాజిటివ్ గా ఉండాలని సూచించారు. చట్ట పరిధి లోకి లోబడి పేద ప్రజలకు ఏ విధంగా సహాయం చేయగలం, గ్రామాలను ఏ విధంగా అభివృద్ధి చేయగలం అని ఆలోచించాలని వెల్లడించారు. ఈజీఎస్ నిధులకు సంబందించిన పనులను మార్చి 21నాటికి పూర్తి చేసి అందుకు సంబందించిన బిల్లులు ప్రభుత్వానికి పంపించాలని అప్పుడే పనులు చేసిన వారికి సకాలంలో బిల్లులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం లో అధికారుల పర్యవేక్షణ మరింత మెరుగవ్వలన్నారు. మంజూరు అయిన ప్రతీ ఇల్లు నిర్మాణ దశకి వెళ్లాలన్నారు. జనగామ జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో జిల్లాను మొదటి స్థానం నిలపడానికి విశేష కృషి చేసిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ లకి శాసనసభ్యులు అభినందన లు తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ గా బదిలీ అయిన రిజ్వాన్ భాషా షేక్‌ని, అలాగే జీహెచ్ఎంసీకి జోనల్ కమిషనర్ గా బదిలీ పైన వెళ్తున్న అదనపు కలెక్టర్ పింకేష్ కు మార్లను శాసనసభ్యులు శాలువాతో సత్కరించి పూల మొక్కను బహూకరించారు.








# జనగామ అభివృద్ధిలో బాషా మార్క్

- జిల్లా పేరును జాతీయ స్థాయికి తీసుకెళ్లిన కలెక్టర్
- విద్య, వైద్యం మీద ప్రత్యేక దృష్టి



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కలెక్టర్‌గా రిజ్వాన్ బాషా షేక్ రెండేళ్లు పూర్తి చేసుకొని జోగులాంబ గద్వాల జిల్లాకు బదిలీ అయ్యారు. జనగామ జిల్లాలో సంక్షేమ పథకాల అమలులో కలెక్టర్ అందించిన విశేష సేవలు, అందుకున్న పురస్కారాలు ప్రతీ ఒక్కరు గుర్తు చేసుకున్నారు. 'మన జిల్లా మన నీరు' అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టి వివిధ శాఖల అధికారుల భాగస్వామ్యంతో ఇంకుడు గుంతల నిర్మాణాలు చేశారు. ఈ క్రమంలో నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా 2025, నవంబర్ 18న దిల్లీలో జరిగిన 6వ జాతీయ జల అవార్డుల కార్యక్రమంలో కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీ. ఆర్. పాటిల్ నుంచి దిల్లీలో జల్ సంచాయ్ జన్ భాగీధారీ 1.0 అవార్డు, అలాగే జల్ ప్రహరీ సమ్మాన్ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. అదే విధంగా సమాచార హక్కు చట్టం దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, అమలులో ప్రతిభ చూపినందుకు గాను 2025, అక్టోబర్ 9న హైదరాబాదులోని రవీంద్ర భారతిలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఉత్తమ జిల్లా అవార్డును పొందారు. అలాగే ఎన్నికల ప్రక్రియలో కీలక పాత్ర వహించే ఎన్నికల అధికారులు, సహాయక అధికారులు, పోలింగ్ సిబ్బంది, పరిశీలకులకు, ఎన్నికల నిబంధనలు, విధివిధానాలపై స్పష్టమైన అవగాహన కల్పించి, సిబ్బంది నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా ఎన్నికల నిర్వహణను అధికారులు సక్రమంగా, పారదర్శకంగా నిర్వహించినందుకు గాను 16వ జాతీయ ఓటర్ల దినత్సవాన్ని పురస్కరించుకొని 2026, జనవరి 25న హైదరాబాదులోని రవీంద్ర భారతిలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఉత్తమ జిల్లాగా పురస్కారాన్ని పొందారు. అదే విధంగా జాతీయ స్థాయి NAS 2024లో తృతీయ తరగతిలో 16వ స్థానం, ఆరవ తరగతిలో 35వ స్థానం, 9వ తరగతిలో 33వ స్థానం సాధించి, దేశవ్యాప్తంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో కేవలం జనగామ జిల్లా విశిష్ట స్థానం సంపాదించినందుకు గాను 2025, సెప్టెంబర్ 5వ తేదీన గురుపూజోత్సవం సందర్భంగా హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలను జిల్లాలోని నిరుపేదలకు అందించేందుకు నిరంతరం పర్యటనలు, సమీక్ష లతో జనగామ జిల్లా ను రాష్ట్ర, జాతీయ స్థాయి లో వివిధ అంశాల్లో ముందంజలో నిలబడేలా చేసిన కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కి ప్రజాప్రతినిధులు, అధికారులు ధన్యవాదములు తెలిపారు. జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం అయిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కి అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.

# జ్యూట్ బ్యాగ్ తయారీపై 30 రోజుల శిక్షణ



**జనగామ, మన చౌరాస్తా :** జిల్లా కేంద్రంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహించే లక్ష్యంతో MSME DFO ఆధ్వర్యంలో 30 రోజుల పాటు జ్యూట్ బ్యాగ్ తయారీపై ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అభ్యర్థులకు శిక్షణ పూర్తి చేసిన అనంతరం సర్టిఫికేట్లను ఘనంగా పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా దశరథ్ (AD, MSME DFO), మూర్తి (లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్), హర్షవర్ధన్ (PD, MEPMA), EDC మేనేజర్ సతీష్ , జ్యూట్ బ్యాగ్ NGO ప్రతినిధి వరలక్ష్మీ మరియు ట్రైనర్ వసంత హాజరయ్యారు. అధికారులు మాట్లాడుతూ, పర్యావరణానికి హితమైన జ్యూట్ బ్యాగ్ తయారీపై ఇలాంటి నైపుణ్య శిక్షణలు యువత మరియు మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను పెంచుతాయని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంలో జ్యూట్ ఉత్పత్తుల పాత్ర ఎంతో కీలకమని, భవిష్యత్తులో జ్యూట్ ఆధారిత ఉత్పత్తులకు మంచి మార్కెట్ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.



# వంటల్లో నాణ్యతను మెరుగుపరచాలి

- విద్యార్థులకు రుచికరంగా వండాలి
- సిద్దిపేట కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, మన చౌరాస్తా :** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ప్రక్రియను జిల్లా కలెక్టర్ కె హైమావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బిర్యానీ అన్నం, క్యాబేజీ, ఆలుగడ్డ, టమాటా కూర, సాంబారు వంటి వంటకాలను పరిశీలించారు. బిర్యానీ, సాంబారు నాణ్యతను మెరుగుపరచాలని, విద్యార్థులకు రుచికరంగా వండాలని వంట సిబ్బందిని ఆదేశించారు. కామన్ డైట్ మెనూను కచ్చితంగా పాటిస్తూ విద్యార్థుల హాజరు ప్రకారం సరుకులు సిద్ధం చేసి అందరికీ సరిపడా భోజనం అందించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. స్టోర్‌రూమ్‌లోని సరుకులను భద్రంగా నిల్వ ఉంచాలని చెప్పారు. డైనింగ్ హాల్, వంటగది పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని గుర్తించి, ఫర్నిచర్ శుభ్రపరచి విద్యార్థులు సౌకర్యంగా కూర్చునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడ్ గ్రామంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. బిర్యానీలో మసాలా, బిర్యానీ ఆకు సరిగా లేకపోవడం, సాంబారు నాణ్యత తక్కువగా ఉండటంపై వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వంటలు నాణ్యతగా, రుచికరంగా ఉండాలని హెచ్చరించారు. భోజన ప్రక్రియను ఫుడ్ చెకింగ్ టీచర్ నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.తరువాత ప్రాంగణంలోని ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహాన్ని సందర్శించి అన్నం, గుడ్డు, పాలకూర పప్పు, బెండకాయ ఫ్రై, సాంబారు, పెరుగు వంటి వంటకాలను పరిశీలించారు. పాలకూర పప్పు పలుచగా ఉందని మెరుగుపరచాలని సూచించారు. విద్యార్థులతో భోజనం గురించి మాట్లాడి కడుపునిండా తినాలని ప్రోత్సహించారు. డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు ఇంజనీరింగ్ అధికారులను పంపిస్తానని హామీ ఇచ్చారు.



## హనుమకొండ కలెక్టర్‌గా చౌహత్ బజ్ పాయ్

**హనుమకొండ, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా నూతన కలెక్టర్‌గా చౌహత్ బజ్ పాయ్ ని ప్రభుత్వం నియమించింది. ఆమె గతంలో మొదట కరీంనగర్ జిల్లా మున్సిపల్ కమిషనర్ గా తదానంతరం హనుమకొండ జిల్లా మున్సిపల్ కమిషనర్ గా సమర్థవంతంగా పనిచేశారు. తిరిగి హనుమకొండ నూతన కలెక్టర్ గా పదవి బాధ్యతలు చేపట్టనున్నారు.

## సర్పంచులను అవమానించిన డీపీఓ, డీఎల్పీవో

**హుజురాబాద్, మన చౌరాస్తా :** హుజురాబాద్ మండలం సింగపూర్ కిడ్స్ కాలేజీలో గత రెండు రోజులుగా సైదాపూర్, వీణవంక మండలాల 53 మంది నూతన సర్పంచులకు నిర్వహిస్తున్న జనరల్ ఓరియంటేషన్ శిక్షణలో అధికారులు వ్యవహరించిన తీరు అత్యంత దారుణమని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను కించపరిచేలా ఉందని టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ అట్రాసిటీ స్టేట్ ఇంచార్జ్ తిప్పారపు సంపత్ తీవ్రంగా మండిపడ్డారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారుల తీరును తీవ్రంగా ఖండించారు. శిక్షణ పేరుతో మా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ, మహిళా సర్పంచులను అవమానపరిచే విధంగా ఒక నేరస్తులుగా, ఒక స్కూలు పిల్లలుగా, నిలిచోబెట్టిన డిపిఓ జగదీశ్వర్, డి ఎల్ పి ఓ శ్రీనివాస్, ఎంపీడీవో యాదగిరి సైదాపూర్, ఎంపీడీవో రాజేశ్వరరావు ఇల్లంతకుంట, ఎంపీఓ సురేందర్ వీణవంక, గ్రామ సెక్రటరీ రేవంత్ రెడ్డి, స్వచ్ఛభారత్ రమేష్‌లు కుర్చీలపై కూర్చొని సర్పంచ్ లను నిలబెట్టడం సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందని మా సర్పంచులను నిలబెట్టి, తాము మాత్రం కుర్చీల్లో కూర్చొని ఫోటోలకు ఫోజులిస్తూ అహంకారాన్ని ప్రదర్శించారని ఆరోపించారు. నూతన సర్పంచులను నిలబెట్టి ఫోటోలు దిగడం వారిని అవమానించడమేనని తిప్పారపు సంపత్ పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులను అవమానపరిచిన సదరు అధికారులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, వారిని తక్షణమే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## మహిళా శక్తికి జాతీయ గుర్తింపు

- సక్సృషి ముల్కనూర్ డైరీకి ప్రతిష్టాత్మక అవార్డు


**భీమదేవరపల్లి, మన చౌరాస్తా:** మహిళల ఆత్మవిశ్వాసం, కృషి, సంఘటిత శక్తి కలిసివస్తే సాధ్యంకాని దేమీ లేదని ముల్కనూర్ స్వకృషి మహిళా పాల డైరీ మరోసారి నిరూపించింది. National Cooperative Development Corporation (ఎన్‌సీడీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన "రీజినల్ అవార్డ్స్ ఫర్ కోఆపరేటివ్ ఎక్సలెన్స్ అండ్ మెరిట్-2025"లో ఉత్తమ సహకార డైరీగా ఎంపికై గౌరవాన్ని సొంతం చేసుకుంది. గ్రామీణ మహిళా రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడం, పారదర్శక పాల సేకరణ విధానాలు అమలు చేయడం, సభ్యులకు సమయానికి చెల్లింపులు అందించడం వంటి అంశాల్లో ప్రతిభ కనబరిచినందుకు ఈ అవార్డు లభించింది. హైదరాబాద్‌లో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో రాష్ట్ర సహకార శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్రమోహన్ చేతుల మీదుగా డైరీ అధ్యక్షురాలు బుర్ర ధనశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా టీజీఎస్‌సీహెచ్‌బి ఎం.డి వై. కృష్ణారావు, ఎన్‌సీడీసీ డైరెక్టర్ సాధు జాదవ్, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, డీసీఓ రమాదేవి, రఘునాధరావు తదితరులు హాజరయ్యారు. డైరెక్టర్లు దొంతరమైన రజితతో పాటు పాలకవర్గ సభ్యులు, డైరీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ అవార్డు ముల్కనూర్ గ్రామానికి మాత్రమే కాకుండా భీమదేవరపల్లి మండలానికి గర్వకారణమని గ్రామస్తులు పేర్కొన్నారు. మహిళా రైతుల సాధికారతకు ఈ గుర్తింపు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని అభిప్రాయపడ్డారు.




## గౌరవెల్లితో పాటు గండిపెల్లి ప్రాజెక్టు

# సరిపడా నిధులు ఇవ్వాలి

### సీఎంకు సీపీఐ నేత చాడ వెంకట్ రెడ్డి లేఖ



**హుస్నాబాద్, మన చౌరాస్తా :** హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని మెట్ట ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించే లక్ష్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం జల యజ్ఞంలో భాగంగా చేపట్టడం జరిగింది. నాడు ఈప్రాంతానికి శాసనసభ్యులుగా ప్రాతినిధ్యం వహిస్తున్న చాడ వెంకటరెడ్డి గౌరవెల్లి, గండిపల్లి,తోటపల్లి రిజర్వాయర్, నిర్మాణానికి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి చేత 2007లో శంకుస్థాపన చేయించడం జరిగిందని అప్పటి నుండి గండి పెల్లి, గౌరవెల్లి సత్వరపూర్తికై అనేక విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అలాగే బిఆర్ఎస్ ప్రభుత్వాలు భూసేకరణ చేయడానికి, ప్రాజెక్టుల నిర్మాణానికి విడతల వారిగా అరకొర నిధులు కేటాయించడంతో అవి పూర్తి కాలేదని సిపిఐ సీనియర్ నేత మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి గురువారం నాడు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. గత ప్రభుత్వాల హయాంలోనే గండిపల్లి ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ జరిగినప్పటికీ నిధులు కేటాయించనందు వలన 40 శాతం మాత్రమే పనులు పూర్తి కాబడింది. గండిపల్లి రిజర్వాయర్ ద్వారానే అక్కన్నపేట మండలంలోని ఎక్కువ గ్రామాలకు 14 వేల ఎకరాలకు సాగు నీరు అందించే అవకాశం ఉందని గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ అనుమతులు, న్యాయ పరమైన చిక్కులు,భూసేకరణలంటి వాటిపై రాష్ట్ర మంత్రులు ఉత్తమ్కుమార్ రెడ్డి పొన్నం ప్రభాకర్ అధికారులతో సమీక్ష చేసి ప్రాజెక్టు పనుల పురోగతికి ముందడుగు వేయడం శుభసూచికం. కాని అట్టి సమావేశంలో చాలా కాలంగా గండిపల్లి రిజర్వాయర్ ప్రస్తావన లేకపోవడం బాధాకరంగా ఉందిని చాడ వెంకటరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ప్రాజెక్టు పూర్తికి ఇప్పటికే 660 ఎకరాలకు గాను 300 ఎకరాలు భూమిని సేకరించబడిందని మిగతా భూమిని సేకరించాల్సివుందని గండిపల్లి ప్రాజెక్టు ద్వారా మాత్రమే శ్రీరాంసాగర్ వరద కాలువ పూర్తి లక్ష్యం నెరవేరుతుందని ఇప్పటి వరకు పనులు చేపట్టిన గండిపల్లి రిజర్వాయర్ ఏజెన్సీ ద్వారా పనులు వేగవంతంగా పూర్తి చేయడానికి చర్యలు చేపట్టవల్సివుందని సిఎం కు రాసిన లేఖలో పేర్కొన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు తో పాటు గండపల్లి రిజర్వాయర్ పూర్తి చేయడానికి ప్రత్యేకంగా 100 కోట్ల నిధులు మంజూరి చేసి యుద్ధ ప్రాతిపదికన రిజర్వాయర్ను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని కోరుతూ రాష్ట్ర మంత్రులు భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బిసి సంక్షేమ శాఖ మంత్రి పోన్నం ప్రభాకర్, శ్రీరాం సాగర్ చీఫ్ ఇంజనీర్ లకు చాడ వెంకటరెడ్డి లేఖలు రాశారు.

# wanted

## విలేకరులు కావలెను







మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

**manachourasta@gmail.com**

**8555800812** **9676400812**


Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**